# గ్యాస్ సబ్సిడీకి మంగళం!

- ఐదారు నెలలుగా వినియోగదారులకు అందని 'రూ.500'
- రెండు మూడు నెలలే అందించిన కాంగ్రెస్ సర్కారు
- ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్రం



పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా తెలంగాణ పోలీస్ అకాడమీ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు(ఫైల్)

చేవెళ్ల రూరల్, మే 19 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలతో గద్దెనెక్కి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నది. అధికారంలోకి రాక ముందు సీఎం రేవంత్‌రెడ్డి, ఆ పార్టీల నేతలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే గృహ వినియోగానికి ప్రతి సిలిండర్‌కు రూ.500 సబ్సిడీ ఇస్తామని చెప్పి.. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అభయ హస్తం పేరిట కొంతమందికే పరిమితం చేశారు. ఐదారు నెలల నుంచి గ్యాస్ సబ్సిడీ అందడం లేదని వినియోగదారులు ప్రభుత్వాన్ని ఘాటుగా విమర్శిస్తున్నారు.

### ఏ ఒక్కటీ అమలు చేయలె..

ప్రభుత్వం అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయడం లేదు. గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు మహాలక్ష్మి పథకానికి సంబంధించిన సబ్సిడీని గాలికి వదిలేసింది. ప్రభుత్వం ఒక సిలిండర్‌కు రూ.500 చొప్పున అకౌంట్‌లో వేస్తామని చెప్పి కొందరికి మాత్రమే రెండు మూడు నెలలు వేసి చేతులు దులుపుకొన్నది.

### 4300 సబ్సిడీ గ్యాస్ కనెక్షన్లు

చేవెళ్ల, శంకర్‌పల్లి, నవాబుపేట మూడు మండలాలకు కలిపి హెచ్‌పీ గ్యాస్ 2600 సబ్సిడీ కనెక్షన్లు ఉండగా, చేవెళ్లకు సంబంధించి భారత్ గ్యాస్ సబ్సిడీ కనెక్షన్లు 1700 ఉన్నాయి. 4300 సబ్సిడీ గ్యాస్ కనెక్షన్లు ఉండగా మొదట రెండు మూడు నెలలు మాత్రమే సబ్సిడీ నగదు వినియోగదారుల అకౌంట్లలో జమ అయ్యింది.

### అయోమయంలో వినియోగదారులు

ఐదారు నెలల నుంచి సబ్సిడీ అమౌంట్ పడకపోవడంతో వినియోగదారులు గ్యాస్ ఆఫీస్, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా వినియోగదారులకు ఎవరూ ఒక క్లారిటీ ఇవ్వకపోవడంతో అయోమయంలో పడుతున్నారు. అసలు అకౌంట్లలో సబ్సిడీ ఎందుకు జమ కావడం లేదని పలు మార్లు బ్యాంక్‌ల చుట్టూ తిరిగినా సమాధానం దొరకడంలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న గ్యాస్ సబ్సిడీ రూ.40 మాత్రమే అకౌంట్‌లో జమ అవుతున్నాయని వినియోగదారులు అంటున్నారు.

### రూ.50 పెంచిన కేంద్రం

రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పైన రూ.500 ఇవ్వాల్సిన సబ్సిడీ ఇవ్వకుండా చేస్తుంటే మరో వైపు కేంద్రంలో మోదీ సర్కార్ సిలిండర్‌పై రూ.50 పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నది. ఓ వైపు రాష్ట్రం, మరో వైపు కేంద్రం ఇలా రెండు వైపులా ప్రజలపై నిత్యావసరాల ధరల భారం మోపడం ఆందోళన కలిగిస్తున్నది.

### ఇప్పటివరకూ రాలేదు



రాష్ట్ర ప్రభుత్వం సిలిండర్‌కు రూ.500 సబ్సిడీ ఇస్తామన్నది. ఇప్పటివరకు మాకు సబ్సిడీకి సంబంధించి బ్యాంకులో రూపాయి కూడా జమవ్వలేదు. రేవంత్‌రెడ్డి అన్ని ఉత్తుత్తి మాటలు చెప్పి ఊదరగొడుతున్నడు తప్పా ఏమీ జేస్తలేడు. ఇచ్చిన హామీ మేరకు సబ్సిడీ అందించాలి.

- నీలమ్మ, ఏర్వగూడ, శంకర్‌పల్లి మండలం

### సబ్సిడీ అందించాలి



గ్యాస్ సిలిండర్‌పై రూ.500 సబ్సిడీ అమౌంట్‌ను ప్రభుత్వం వినియోగదారుల అకౌంట్లలో జమ చేయాలి. దాదాపు ఆరు నెలల నుంచి సబ్సిడీ అందడం లేదు. ఈ విషయమై అధికారులను అడిగినా వస్తయి అంటున్నరే తప్పా పైసలు పడుతలేవు.

- పి.విజయ, ఏర్వగూడ, శంకర్‌పల్లి మండలం

### పేదల నడ్డివిరుస్తున్నాయి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల పెంపుతో పేద ప్రజల నడ్డి విరుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న గ్యాస్ సిలిండర్ సబ్సిడీ నగదు వినియోగదారుల ఖాతాల్లో జమ చేయడంలేదు. దానికి తోడు కేంద్ర సర్కార్ సిలిండర్‌పై రూ.50 పెంచడం సరికాదు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలి. లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తాం.

- దేవేందర్, సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి

# గుల్జార్ హౌస్ ఘటన బాధాకరం

## అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి : కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

ఆదిబట్ల, మే 19: హైదరాబాద్‌లోని చార్మినార్ సమీపంలోని గుల్జార్‌హౌస్ ఘటనలో 17మంది మృతి చెందడం ఎంతో బాధాకరమని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో ఫైర్ ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు సోమవారం అవగాహన కల్పించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ...ఆదివారం తెల్లవారు జామున గుల్జార్ హౌస్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడం తో మూడు తరాలకు చెందిన 17మంది కుటుంబ సభ్యులు బలికావడం బాధాకరమన్నారు. ఐకానిక్ చార్మినార్ నుంచి 100మీటర్ల తక్కువ దూరంలో ఉన్న గుల్జార్ హౌస్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించి ఒక్కసారిగా మంటలు చెలరేగి.. 17మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపా రు. జిల్లాలో అక్రమ విద్యుత్ కనెక్షన్ల వల్ల షార్ట్ సర్క్యూట్ నెలకొని విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయన్నారు. అలాంటి సమస్యలను పరిష్కరించి ప్రాణనష్టం జరగకుండా మున్సిపల్ కమిషనర్లు, విద్యుత్ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వారంరోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి .. అక్రమ కనెక్షన్లను తొలగించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా విద్యా సంస్థలు, ఆసుపత్రులు, కమర్షియల్ ఏరియాల్లో ఫైర్ సేఫ్టీ పా టిస్తున్నారా? లేదా? చూడాలని అధికారులకు సూచించారు. లేనివాటిపై తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. లూజ్ కనెక్షన్లు లేకుండా వైరింగ్ బాగుందా? లేదా? చూడాలన్నారు. భవిష్యత్తులో జిల్లాలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మున్సిపల్ కమిషర్లు, విద్యుత్ అధికారులు తగిన చర్యలు చేపట్టాల ని కోరారు. జిల్లాలో ఎక్కడ కూడా అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ఫైర్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు ఉన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

# ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

## వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

ధారూరు, మే 19 : ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం వికారాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మొత్తం 119 దరఖాస్తులు రాగా రెవెన్యూ సమస్యలతో పాటు హౌసింగ్, డీపీఓ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డు, పశు సంవర్ధక, డీఆర్‌డీఓ(పెన్షన్), పోలీస్ శాఖలకు చెందిన అర్జీలు ఉన్నాయి. ప్రజావాణిలో అదనపు జిల్లా కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగ భద్రతే లక్ష్యంగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలి



విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించేలా ఐటీఐ కళాశాల పనిచేయాలని, ఉద్యోగ భద్రతే లక్ష్యంగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం వికారాబాద్ పట్టణంలో ని ఐటీఐ కళాశాలను ఆయన సందర్శించి ..విద్యార్థులతో మాట్లాడారు. అనం తరం మాట్లాడుతూ.. కళాశాలలోని వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తాన న్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, శిరీష, వెంకట్, శివరాజ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

*–ధారూరు/బంట్వారం, మే 19*

# ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ను వేగవంతం చేయాలి..

## 'ప్రజావాణి'లో 53 ఫిర్యాదులు.. తక్షణమే పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ ఆదేశం

ఆదిబట్ల, మే 19 : ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్‌ను వెగవంతం చేసి ఈ నెల 25లోపు పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కా ర్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి'కి జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. గ్రామాల్లో, మున్సిపాలిటీల పరిధిలో తాగు నీటి కొ రత ఏర్పడకుండా చూడాలని డీపీఓకు, మున్సిపల్ కమిషనర్లకు, మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖ ల అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణికి 53 ఫిర్యాదులు వచ్చాయ ని, అందులో రెవిన్యూశాఖకు –24, ఇతరశాఖలకు –29 ఉన్నాయని తెలిపా రు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని వేడుకుంటున్న దివ్యాంగ దంపతులు

### ఇందిరమ్మ ఇంటికోసం దివ్యాంగ దంపతుల మొర..

రంగారెడ్డి, మే 19 (నమస్తే తెలంగాణ) : మేము దివ్యాంగులం.. పీజీ వరకు చదువుకున్నా ఉద్యోగం లేదు..కనీసం ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని ఆ దంపతులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చి వేడుకున్నారు. తామిద్దరం అంగవైకల్యం పొందామని, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అంగవైకల్యం ఉన్నవారికి వెంటనే ఇల్లు ఇవ్వాలని నిబంధన కూడా ప్రభుత్వం పెట్టిందని, అయినప్పటికీ మాకు ఇల్లు రాలేదని వారు మొరపెట్టుకున్నారు. రంగారెడ్డిజిల్లా సరూర్‌నగర్ మండలంలోని చంపాపేటలో ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్నామని, అద్దెకూడా చెల్లించలేని స్థితిలో ఉన్నామని వారు వేడుకున్నారు. సరూర్‌నగర్ మండలానికి చెందిన రొండి నాగమ్మ ఆమె భర్త నాగేశ్‌లు వికలాంగులు. ఇద్దరు కలిసి పీజీ వరకు చదువుకున్నారు. వీరికి ఐదేళ్ల కూతురు కూడా ఉంది. దివ్యాంగులైనందున వారికి ఉద్యోగం రాక కుటుంబ పోషణ భారంగా మారిందని అన్నారు. ప్రతి నెలా అద్దె కట్టడానికి డబ్బులులేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఇందిరమ్మ ఇంటికోసం ఇప్పటికే ప్లానింగ్ కమిషన్ చైర్మన్ చిన్నారెడ్డిని కూడా కలిసి వినతిపత్రం ఇచ్చామని, అయినప్పటికీ ఇల్లు రాలేదన్నారు. రంగారెడ్డిజిల్లా పరిధిలో ఉంటున్న తమకు ఎలాగైనా ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి ఆదుకోవాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇల్లు ఇప్పించడానికి కృషి చేస్తానని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

# సేవల విస్తరణ

## నిమ్స్‌లో జూన్ 1 నుంచి వ్యాస్కులర్ ఓపీ




సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ): రోగుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నిమ్స్‌లో వివిధ విభాగాల ఓపీ సేవలను మరింత విస్తరించేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో వారంలో మూడు రోజులు ఉన్న ఓపీ పనిదినాలను అన్ని పనిదినాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగానే వ్యాస్కులర్ విభాగం ఓపీని ఇక నుంచి అన్ని పనిదినాల్లో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప వెల్లడించారు. ఈ విభాగానికి సంబంధించి ప్రస్తుతం వారంలో మూడు రోజులు మాత్రమే ఓపీ సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఓపీ రోజున సుమారు 300 నుంచి 400 వరకు రోగులు వస్తుంటారు. దీని వల్ల అటు వైద్య సిబ్బందిపై ఒత్తిడి పెరగడమే కాకుండా రోగులకు సైతం నిరీక్షణ తప్పడం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని రోగుల సౌకర్యార్థం వ్యాస్కులర్ ఓపీని అన్ని పనిదినాల్లో అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసినట్లు డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. జూన్ 1 నుంచి ఇది అమల్లోకి వస్తుందన్నారు. కాగా, పిడియాట్రిక్ భవనంలో ఇప్పటికే పిడియాట్రిక్ రుమటాలజీ(ఎస్ఎల్ఈ), అంకాలజీ విభాగంలో హెడ్ అండ్ నెక్ క్లినిక్‌ను ప్రారంభించినట్లు వివరించారు.

### రెండు కొత్త విభాగాలు

నిమ్స్‌కు నాలుగు కొత్త విభాగాలు మంజూరైనట్లు డైరెక్టర్ డాక్టర్ బీరప్ప వెల్లడించారు. క్రిటికల్ కేర్ విభాగంలో నాలుగు డీఎం సీట్లు, న్యూరో అనస్తీషియా విభాగంలో నాలుగు డీఎం సీట్లు మంజూరు కావడంతో క్రిటికల్ కేర్, న్యూరో అనస్తీషియా విభాగాలను కొత్తగా ప్రారంభించినట్లు వివరించారు. దీంతో పాటు ఫెల్లోషిప్ కోర్సులు సైతం ప్రారంభమైనట్లు తెలిపారు.


# ఔటర్‌పై వేర్వేరు రోడ్డు ప్రమాదాలు..

## కారు అదుపుతప్పి ఒకరు, పాల ట్యాంకర్‌ను ఢీకొని మరొకరు మృతి



ఆదిబట్ల/పెద్దఅంబర్‌పేట, మే 19 : ఔటర్‌పై జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ఒక ఘటనలో అతి వేగంతో ఉన్న కారు అదుపుతప్పి బారికేడ్లను ఢీకొనగా అవి కారులోకి గుచ్చుకుని ఒకరు, మరో ఘటనలో రోడ్డు పక్కన ఆగి ఉన్న పాల ట్యాంకర్‌ను లారీ ఢీకొనగా మరొకరు మృతి చెందారు. ఈ ఘటనలు ఆదిబట్ల, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ల పరిధిల్లో చోటుచేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శిల్పానగర్ కాలనీ, నాగారంకు చెందిన కితాబ్ అలీ (35) పనుల కోసం లేబర్‌ను సప్లై చేస్తుంటాడు. ఇందులో భాగంగానే సోమవారం కారులో తుక్కుగూడ నుంచి కీసర వైపు ఇంటికి ఔటర్ రింగ్‌రోడ్డుపై వెళ్తున్నాడు. బొంగుళూరు ఎగ్జిట్ 12 వద్దకు రాగానే కారు అదుపుతప్పి ఇనుప బారీ కేడ్లను ఢీకొట్టాడు. దీంతో కారు ముందు అద్దం నుంచి ఇనుప బారీ కేడ్లు చొచ్చుకురావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

### పాల ట్యాంకర్‌ను ఢీకొని లారీ డ్రైవర్..



పశ్చిమబెంగాల్‌లోని హౌరా జిల్లాకు చెందిన ఎండీ అలీ (40) లారీలో పెద్దఅంబర్‌పేటలోని ఓఆర్ఆర్‌పై ఎగ్జిట్ నంబర్ 11 దాటి ఘట్‌కేసర్‌వైపు వెళ్తున్నాడు. అయితే.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా తిరుమల పాల ట్యాంకర్‌ను డ్రైవర్ పక్కన ఆపాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన లారీ.. పాల ట్యాంకర్‌ను వెనకనుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో లారీ డ్రైవర్ అలీ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు ఆయా పోలీస్‌స్టేషన్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సత్వరమే పరిష్కరించాలి

## అధికారులకు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ఆదేశం

సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ ): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ నేరుగా 66 దరఖాస్తులను స్వీకరించారు. ఫోన్ ఇన్ ద్వారా 4 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 113 అర్జీలు వచ్చాయని చెప్పారు. కూకట్‌పల్లి జోన్‌లో 40, శేరిలింగంపల్లి 14, ఎల్బీనగర్ 9, సికింద్రాబాద్ 17, చార్మినార్ 3, ఖైరతాబాద్ 30 అర్జీలు అందాయన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్‌లు వేణు గోపాల్, పంకజ, గీతా రాధిక, నళిని పద్మావతి, రఘు ప్రసాద్, యాదగిరి రావు, సత్యనారాయణ, వేణుగోపాల్ రెడ్డి, సీసీపీ శ్రీనివాస్, అడిషనల్ సీసీపీలు గంగాధర్, వెంకన్న, ఎల్ఏఓ రాము నాయక్, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, హార్టికల్చర్ అధికారి సునంద, ఎలక్ట్రిసిటీ ఈఈ మమత, ఎస్టేట్ ఆఫీసర్ ఉమా ప్రకాష్, జలమండలి డీజీఎం సాయి రమణ, డిప్యూటీ సీఈ పనస రెడి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

## వికారాబాద్ జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్

ధారూరు, మే 19 : తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియెట్ బోర్డు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని వికారాబాద్ జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ అన్నారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని ఇంటర్మీడియెట్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులు, కస్టోడియన్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్, సిటింగ్ స్క్వాడ్ మెంబర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ మాట్లాడుతూ.. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రెండు సెషన్లలో నిర్వహిస్తున్నందున.. దానికనుగుణంగా విద్యార్థుల కోసం ఆర్టీసీ రవాణా సౌకర్యం కల్పిస్తుందన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షల సందర్భంగా నిరంతరం విద్యుత్ అందించడానికి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు. పరీక్షలకు అవసరమైన ఇన్విజిలేటర్ల కోసం సంబంధిత మండల విద్యాధికారిని సంప్రదించినట్లయితే కేటాయించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షలు ఈ నెల 22నుంచి 28వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొ దటి సంవత్సరం పరీక్షలు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఎడల తీవ్రత దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో మంచి నీటి సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, రిస్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లకు అనుమతి లేదన్నారు. జిల్లాలోని 10 పోలీస్ స్టేషన్ల పరిధిలో 20 పరీక్షా కేంద్రాల్లో మొదటి సంవత్సరం జనరల్‌లో 5,217, ఒకేషనల్‌లో 457, ద్వితీయ సంవత్సరం జనరల్‌లో 2071, ఒకేషనల్‌లో 314 విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలన్నారు. విద్యార్థులు సంబంధిత కళాశాలల నుంచి హాల్ టిక్కె ట్లు పొందవచ్చునని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల సమన్వయ కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, సత్తయ్య, కుమారస్వామి, సురేశ్వర స్వామి, వెంకటేశ్వర రావు, చీఫ్ సూపరింటెండెంట్లు, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులు, కస్టోడియన్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్, సిటింగ్ స్క్వాడ్, వివిధ కళాశాలల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

# కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

## అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి



అబ్దుల్లాపూర్‌మెట్, మే 19 : మండలంలోని ప్రభుత్వ భూముల జోలికి వస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల కబ్జాపై జిల్లా కలెక్టర్, ఆర్డీఓల ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బందితో కలిసి మండలంలోని ప్రభుత్వ భూములను సర్వే పూర్తి చేసి ఫెన్సింగ్ వేసి సూచికబోర్డులు ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని వివిధగ్రామాల్లో 865.11 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నట్లు గుర్తించామని, ఇందులో 379.25 గుంటల ప్రభుత్వభూమి ఖాళీగా ఉందని తమ సర్వేలో తేలిందన్నారు. గత రెండు మూడు రోజులుగా బాటసింగారం రెవెన్యూ పరిధిలోని సర్వేనం 10/95, 10/96లో ఉన్న ప్రభుత్వ భూమిలో మల్‌రెడ్డి రంగారెడ్డి కాలనీ కమాన్ ఏర్పాటు చేసి ఎమ్మెల్యే అనుచరులం అని చెబుతున్న కొంతమంది కబ్జాదారులు ప్లాట్లు చేసి అమ్మకాలు చేస్తున్నారనే సమాచారంతో కూల్చివేతలు చేపట్టామని చెప్పారు. ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై తనకు ఎలాంటి సంబంధం లేదని ఆగ్రహించిన ఎమ్మెల్యే ..నా పేరును వాడుకొని ప్రభుత్వ భూములు కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తహసీల్దార్ తెలిపారు. అదే విధంగా అనాజ్‌పూర్ సర్వేనం 281లో కూడా భూ కబ్జాలు చేస్తూ వెంచర్ చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇరిగేషన్, క్యాడ్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే చేయగా 92 ఎకరాల భూమిని గుర్తించడం జరిగిందని తెలిపారు. అక్కడ ఉన్న ఇందిరసాగర్ కాల్వ కబ్జా అయ్యిందని వచ్చిన ఫిర్యాదుతో సర్వే చేశామని, రిపోర్టు రాగానే ఆ వెంచర్‌పై కూడా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎవరైనా ప్రభుత్వ భూముల్లో కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# రక్షణ గోడ లేకుండాసెల్లార్ తవ్వద్దు

## వర్షాకాలం నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ స్పెషల్ డ్రైవ్

సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ): వర్షాకాలం ముందస్తు చర్యలపై జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అప్రమత్తమైంది. కమిషనర్ ఆర్ వీ కర్ణన్ ఆదేశాల మేరకు సెల్లార్, శిథిల భవనాల ప్రమాదాల నివారణే లక్ష్యంగా సర్కిళ్ల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని సీసీపీ కె. శ్రీనివాస్ జోనల్ ఏసీపీలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయా జోనల్ ఏసీపీ నిర్మాణ దశలో ఉన్న కన్‌స్ట్రక్షన్స్‌పై క్షేత్రస్థాయి తనిఖీలు చేపడుతున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి ఒక్క నిర్మాణదారు సెల్లార్ దశలో రక్షణ గోడ నిర్మించాలి. చాలా మంది సెల్లార్ తవ్వకాలపై నిబంధనలు ఉల్లంఘించి ఎడపెడా పనులు జరపడం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో శేరిలింగంపల్లి సిద్ధిఖ్‌నగర్‌లో ఓ భవనం నేలకు ఒరిగింది. ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. వెంటనే అధికారులు సంబంధిత భవనాన్ని పూర్తిగా నేలమట్టం చేశారు. ఎల్బీనగర్‌లో సెల్లార్ తవ్వకాల సందర్భంగా మట్టిదిబ్బలు కూలి కార్మికులు చనిపోయిన సందర్భాలు ఉన్నాయి. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని వర్షాకాలంలో ప్రమాదాలకు తావివ్వకుండా ముందస్తుగా సంబంధిత నిర్మాణదారులను గుర్తించి అప్రమత్తం చేసేందుకు ఏసీపీ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. నిబంధనలు పాటించని వారికి నోటీసులు జారీ చేయనున్నారు. అంతేకాకుండా వర్షాకాలం ప్రారంభం నాటికల్లా తవ్వి ఉంటే అక్కడ అన్ని జాగ్రత్త చర్యలు పాటించాలి. సాయిల్ బలోపేతం, రిటైనింగ్ వాల్, బారికేడింగ్ తదితర చర్యలు తీసుకోవాలని సూచించనున్నారు. చుట్టు పక్కల భవనాలకు ప్రమాదం జరగకుండా తగిన జాగ్రత్త చర్యలు పాటించాలి. ఒక వేళ ప్రమాదానికి ఆస్కారం ఉంటే వెంటనే సీ అండ్ డీ విభాగం సహకారంతో సెల్లార్‌ను మూసివేయాలి. వర్షాకాలంలో అక్రమంగా ఎవరైనా సెల్లార్ తవ్వితే వెంటనే చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకునేలా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వీటికి తోడు శిథిల భవనాల గుర్తింపునకు సర్వే చేపడుతున్నారు. సంబంధిత భవనం ప్రమాదకరంగా ఉంటే వెంటనే అందులో ఉంటున్న వారిని ఖాళీ చేయించి భవనాన్ని సీజ్, చుట్టు పక్కల వారికి ప్రమాదం జరగకుండా బారికేడింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోనున్నారు.